క్లుప్తంగా

నేషనల్ లెవల్ చెస్ పోటీలకు వెంకటగిరి విద్యార్థిని


నిహారిక

వెంకటగిరి రూరల్ : జాతీయ స్థాయి చెస్ పోటీలకు వెంకటగిరి విద్యార్థిని రంగినేని నిహారిక ఎంపికైనట్టు విజయ్ చెస్ అకాడమీ నిర్వాహకులు విజయ్ నర్రా తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన రీజనల్ స్పోర్ట్స్ మీట్‌లో ఏపీలోని అన్ని జిల్లాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో వెంకటగిరికి చెందిన నిహారిక 5 పాయింట్లకు గాను 3.5 పాయింట్లు సాధించి 4వ స్థానంలో నిలిచిందన్నారు. ఆమెను పలువురు అభినందించారు.

వసంతోత్సవాలు


మల్లమ్మగుంటలో వసంతాలు చల్లుకుంటున్న చిన్నారులు

రాపూరు: రాపూరులోని మల్లమ్మగుంట గిరిజన కాలనీలో గురువారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని రిక్షాలో ఉంచి ఊరేగించారు. అనంతరం చిన్నారులు వసంతోత్సవాలు జలుకుకున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా కోలాహలంగా మారింది.

సర్వేపల్లి రాధాకృష్ణకు నివాళి


వెంకటగిరి రూరల్ : సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ అధికారి అంజయ్య ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు లీలావతి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ



వాకాడు : వాకాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నేదురుమల్లి పద్మనాభరెడ్డి జయంతిని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జేమ్స్, నాయకులు పెళ్లూరు కోటేశ్వరరెడ్డి, నేదురుమల్లి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు పెంచలరెడ్డి, దారా అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

చిల్లకూరు : బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని గూడూరు రెండో పట్టణంలోని జీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం రమీశ్యా తెలిపారు. ఆమె గురువారం ఉపాధ్యాయులతో కలిసి మెండలేజ్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ఉచితంగా పుస్తకాలు అందజేస్తున్నామని, వసతులు ఉన్నాయని తెలిపారు. మెండలేజ్ కంపెనీ ప్రతినిధులు ముందుకు వచ్చి పట్టణ ప్రాంతంలో డ్రాప్ అవుట్‌లు లేకుండా కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ వెంకటసుబ్బయ్య, మ్యాజిక్ బస్ కోచ్ లత, ఉపాధ్యాయులు శ్రీదేవి, హిమవతి, వాసు, రమణయ్య, రహమతున్నిసా పాల్గొన్నారు.

చెరువులకు గంగ నీరు కలేనా..?

- ఎడగారు వరి సాగుకు సన్నద్ధం
- గంగ నీటి కోసం మూడు మండలాల రైతుల ఎదురు చూపు


కోగిలి చెరువుకు కాలువల ద్వారా ప్రవహిస్తున్న తెలుగుగంగ నీరు(ఫైల్)

చిట్టమూరు : మండలంలో రైతులు సుమారు 15 వేల హెక్టార్లలో ఎడగారు పంటలు సాగు చేస్తారు. గత ఏడాది డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరింది. ఆ నీటితో రబీలో వరి పంటలు సాగు చేశారు. వరి కోతలు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం రైతులు ఎడగారు పంటలు సాగు చేయడానికి సిద్ధమయ్యారు. చెరువులకు తెలుగు గంగ నీరు వస్తే పంటలకు సాగునీటి కొరత ఇబ్బంది ఉండదు. ఆ నీటిని నమ్ముకుని గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాల ప్రజలు ఎడగారు పంటలు సాగు చేస్తూ ఉంటారు. ఈ ఏడాది అధికారులు ఇప్పటి వరకు తెలుగు గంగ నీటి విడుదల గురించి పట్టించుకోలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు

ప్రస్తుతం రైతులు వరినార్లు పోసుకుని నాటుకోవడానికి సిద్ధమయ్యారు. చెరువుల్లోని నీరు తక్కువగా ఉండడంతో తెలుగు గంగ నీటి కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో ఎడగారు పంటలకు ఇబ్బంది లేకుండా దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ రాంబట్లపల్లి నుంచి తెలుగుగంగ నీటిని 7వ బ్రాంచి కెనాల్ ద్వారా చిట్టమూరు మండలంలోని మల్లాం చెరువుకు విడుదల చేశారు. ఆ తర్వాత ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కూడా మండలంలోని యాకసిరి, మెట్టు, తిమ్మారెడ్డివాగు, అద్దెపూడి, ఎల్లసిరి, కోగిలి, మల్లాం, చిట్టమూరు, జంగాలపల్లి, తాడిమేడు చెరువులకు తెలుగు గంగ నీటిని విడుదల చేశారు. అలాగే కోట, వాకాడు మండలాల్లోని చెరువులకు సైతం నీటిని విడుదల చేశారు. దీంతో


తెలుగు గంగ నీరు ప్రవాహం లేకపోవడంతో ఎండిన 7వ బ్రాంచి కెనాల్

రైతులు ఎడగారు పంటలు పండించుకున్నారు. భూగర్భ జలాలు కూడా పెరిగి బోర్లలో సమృద్ధిగా నీరు వచ్చేది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వున్న ఐదేళ్లు తెలుగుగంగ నీటిని విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తెలుగు గంగ నీటి గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పటికే చెరువుల్లో నీరు అడుగంటింది. బోరు నీటి ఆధారంగా వరినార్లు పోసుకుని ఎడగారు సాగుకు సిద్ధమైన రైతులు నీటి కోసం ఆందోళన చెందుతున్నారు. అంతేగాక తాగునీటి కోసం యాకసిరి, మెట్టు, తిమ్మారెడ్డివాగు, అద్దెపూడి, ఎల్లసిరి, కోగిలి, మల్లాం, చిట్టమూరు, జంగాలపల్లి, తాడిమేడు తదితర గ్రామాల ప్రజలు అల్లాడుతున్నారు. తెలుగు గంగ నీటిని విడుదల చేసి సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

గంగ నీరు విడుదల చేయాలి



గత ప్రభుత్వం చిట్టమూరు మండలంలో ఎడగారులో పంటలు సాగు చేసుకునేందుకు తెలుగుగంగ నీటిని విడుదల చేసింది. రైతులు వరినాట్లు వేసి పంటలు పుష్కలంగా పండించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తెలుగు గంగ నీటి గురించి పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించాలి. – మాచిరెడ్డి సుధీర్ రెడ్డి, యాకసిరి

నాయకులను కలిసినా ఫలితం లేదు



చెరువులకు తెలుగు గంగ నీటిని విడుదల చేస్తే ఎడగారులో సుమారు 15 వేల హెక్టార్లలో వరి పంట సాగవుతుంది. వరినార్లు పోసుకుని సాగుకు సిద్ధమయ్యాము. ఇప్పటి వరకు చెరువులకు తెలుగు గంగ నీటి విడుదల గురించి అధికారులు పట్టించుకోలేదు. దీనిపై నాయకులను కలిసినా ఫలితం లేదు. – సన్నారెడ్డి విజయులు రెడ్డి, చిల్లమూరు సర్పంచ్

నోటీస్ బోర్డు

21న మోడల్ ప్రవేశ పరీక్ష

వెంకటగిరి రూరల్ : ఈ నెల 21న ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తులసిజ్యోతి తెలిపారు. 434 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. హాల్ టికెట్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, అందులో విద్యార్థి ఫొటో లేకపోయినా, మిస్ మ్యాచ్ అయినా పాస్ ఫొటో అటించి వారు చదివే హెచ్‌ఎంల సంతకం, పాఠశాల సీలు వేయించుకోవాలని సూచించారు. అలాగే మరో పాస్‌ఫొటో తీసుకురావాలని సూచించారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

నాయుడుపేట టౌన్: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. చిన్న పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదుతోపాటు పేర్లు, ఫోన్ నంబర్లు మార్పు తదితర సేవలు అందిస్తున్నట్టు తెలిపారు.

వెంకన్నపాళెంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

కోట: మండలంలోని వెంకన్నపాళెంలో గురువారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. డాక్టర్లు పద్మావతి, హరిత మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు చేశారు. నలభై ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే తగిన మందులు వాడి నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో చిట్టేడు పీహెచ్‌సీ డాక్టర్లు నాగరాజు, సంధ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

సైదాపురం/రాపూరు/ఓజిలి : గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, సౌజన్య, ఆర్.సుజన తెలిపారు. వారు గురువారం సైదాపురం మండలంలోని కొమ్మిపాడు, రాపూరు మండలం రావిగుంటపల్లి, ఓజిలి మండలం నెమళ్లపూడి మెయిన్, ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు పాలు, గుడ్లు, ఆకుకూరలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు తల్లి


రాపూరు : రావిగుంటపల్లిలో పౌష్టికాహార పక్షోత్సవాలు

పాలు పట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ విగ్రహ పటిష్టత పనుల పరిశీలన

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని గోమతి సర్కిల్ వద్ద దివంగత మహానేత వైఎస్‌ఆర్ విగ్రహ పటిష్టత కోసం చేస్తున్న పనులను గురువారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరిశీలించారు. భారీ వాహనాలు ఢీకొనడంతో విగ్రహం ఒక వైపునకు ఒరిగిపోయింది. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కటకం జయరామయ్య విగ్రహ పటిష్టత పనులు చేపట్టారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి, బైనా మల్లికార్జున రెడ్డి, పేట చంద్రారెడ్డి, ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దేశిరెడ్డి మధుసూదన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

చిట్టమూరు : మండలంలోని అరవపాళెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సరస్వతీ దేవికి పూజలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంఈవోలు బీవీ కృష్ణయ్య, వెంకటేశ్వర ప్రసాద్‌ను శాలువాతో సత్కరించారు. హెచ్‌ఎం రవి, ఉపాధ్యాయులు మీరయ్య, రమేష్, ఎంఆర్ చక్రవర్తి, సుధాకర్, వెంకటేశ్వర్లు, పుష్పలత, అపర్ణ, సురేఖ పాల్గొన్నారు.

గోకులకృష్ణలో ముగిసిన జాతీయ సదస్సు

సూళ్లూరుపేట : పట్టణంలోని శ్రీగోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్‌లో ఉద్భవిస్తున్న నూతన సాంకేతికతలపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఇందులో ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూఏ స్పాన్సర్డ్ రీసెర్చ్ డైరెక్టర్ బి.ఈశ్వరరెడ్డి, జేఎన్‌టీయూఏ బీవోఎస్, ఈసీఈ చైర్మన్ ఆర్.రమణారెడ్డి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు, అంతర్‌శాఖల సమన్వయం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సదస్సుకు ఏపీ, తెలంగాణా, తమిళనాడు నుంచి 50 మందికి పైగా విద్యార్థులు విచ్చేసి పరిశోధనా పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ ముచ్చకాలు సురేష్ యాదవ్, ఏవో గుర్రం మనోహర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయం

కలువాయి(సైదాపురం)/దక్కిలి : ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయశాఖ అధికారి చంద్ర, ప్రకృతి వ్యవసాయ శాఖ ఎంటీ సుహర్లత తెలిపారు. కలువాయి మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం సాధికార సంస్థ, ఏపీ ప్రజారోగ్యం, ప్రకృతి వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ –2025లో భాగంగా పొదుపు మహిళలు, రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అలాగే దక్కిలి మండలం డి.ఉప్పరపల్లి యూనిట్‌లో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న వీవోఏలు, పొదుపు సిబ్బంది పొదుపు గ్రూపు సభ్యులను సమన్వయం చేసుకుని సెంటు నుంచి 5


కలువాయి : మాట్లాడుతున్న చంద్ర

సెంట్ల భూమిలో ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలన్నారు. రైతులు తమ పొలాల్లో 20 రకాల నవధాన్యాల విత్తనాలు సాగు చేసి కలియదున్నాలని సూచించారు. తద్వారా భూమి సారవంతమవుతుందని, అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఎంసీఆర్పీ పెంచలయ్య, ఎల్2 రజనీ, కవిత, నారాయణ రైతులు పాల్గొన్నారు.

కండలేరులో 46.226 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 46.226 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,390, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

సైదాపురం: ఊటుకూరు దళితులపై మైనింగ్ మాఫియా పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, దళితుల భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. ఆయన గురువారం దళితులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఊటుకూరు సమీపంలో సర్వే నంబర్ 359, 356లో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరారు. అలాగే భూస్వాములు, పెత్తందారుల ఆక్రమణలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులపై పెట్టిన కేసులు ఎత్తి వేసే వరకు ఆందోళనలు విరమించేది లేదన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. రమేష్, వెంకటయ్య, మమత, కోటయ్య, అంకయ్య పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న దళితులు, రైతు కూలీ సంఘం సభ్యులు

అగ్ని ప్రమాదాలపై అవగాహన

వెంకటగిరి (సైదాపురం)/రాపూరు : అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని వెంకటగిరి, రాపూరు అగ్నిమాపక కేంద్రం అధికారులు నారాయణ, కుప్పయ్య తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం వెంకటగిరిలోని శ్రీ చైతన్యం పాఠశాల, రాపూరులోని మల్లమ్మగుంట, కరుణామయి విద్యాలయాల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతూ ఉంటాయన్నారు.


రాపూరులో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగకుండా చూడొచ్చన్నారు. మహిళలు వంటి వండిన తర్వాత గ్యాస్‌ను ఆపేయాలని సూచించారు.

3వ రోజూ మున్సిపల్ కార్మికుల ధర్నా


వెంకటగిరిలో కార్మికుల ధర్నా


గూడూరులో నిరసన తెలుపుతున్న కార్మికులు

వెంకటగిరి రూరల్ : తమను రెగ్యులర్ చేయడంతో పాటు ఆప్కాస్‌ను కొనసాగించాలని వెంకటగిరి, గూడూరు మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. వారు గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మూడో రోజూ ధర్నా చేశారు. ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. డీఏ సరెండర్ లీవ్‌ల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్లకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వెంకటగిరి యూనియన్ జాయింట్ సెక్రటరీ పెంచలయ్య, నాయకులు గోపాల్, సుబ్రమణ్యం, రమణయ్య, కృష్ణమ్మ, సుబ్బరత్నమ్మ, సీఐటీయూ గూడూరు పట్టణ అధ్యక్షుడు బీవీ రమణయ్య, బీ రమేష్, దారా కోటేశ్వరరావు, ఎస్ వెంకటరమణ, మురళీ, మణెమ్మ, సంపూర్ణమ్మ, జోగి శివకుమార్, అడపాల ప్రసాద్, నారాయణ, శ్రీనివసాఉలు మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాయుడుపేట టౌన్ : విద్యుత్ స్తంభాల ఏర్పాటు, సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల వల్ల శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏఈ ఎస్ శివశంకర్ తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట




చిల్లకూరు : ప్రేమ పెళ్లి చేసుకున్న తమను విడదీసేందుకు పెద్దలు ప్రయత్నిస్తున్నారని ప్రేమజంట వాపోయింది. వారు గురువారం గూడూరు డీఎస్పీ గీతాకుమారిని కలిసి రక్షణ కల్పించాలని కోరారు. తెనాలికి చెందిన విజయలక్ష్మీ శ్రీసిటీలోని ఒక పరిశ్రమలో పనిచేస్తోంది. అదే పరిశ్రమలో పనిచేస్తున్న చిల్లకూరు మండలం ఏరూరుకు చెందిన ఆదిల్‌బాషాతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వారు పెళ్లి చేసుకుని అద్దె ఇల్లు తీసుకుని కాపురం పెట్టారు. యువతి తల్లిదండ్రులు విషయం తెలుసుకుని తెనాలిలో మిస్సింగ్ కేసు నమోదు చేయించారు. అంతటితో ఆగక ఆమెను తెనాలికి తీసుకెళ్లి మరో పెళ్లి చేసేందుకు సిద్ధపడ్డారు. దీంతో విజయలక్ష్మీ తన భర్త ఆదిల్‌బాషా వద్దకు వచ్చేసింది. అమ్మాయి కుటుంబ సభ్యులు ఏరూరుకు వెళ్లి ఆదిల్ బాషా కుటుంబ సభ్యులను బెదిరించడంతో పెద్దల నుంచి రక్షణ కల్పించాలని డీఎస్పీని కోరారు.


విద్యార్థుల హాజరు పెంపునకు చర్యలు

నాయుడుపేట టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచాలని ఎంపీఈ–2 మునిరత్నం కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో సురేష్‌బాబు అధ్యక్షతన సీడీపీవో ఉమామహేశ్వరి, ఎంఈవో–1 శాంతి, తదితరులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్, ఫౌండేషన్, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీడీపీవో ఉమామహేశ్వరి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో ఐదేళ్లు నిండిన వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కార్యకర్తలను ఆదేశించారు. ఈవోపీఆర్‌డీ మల్లు గోపాల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

వెంకటగిరి రూరల్/రాపూరు/సూళ్లూరుపేట/చిల్లకూరు : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం వెంకటగిరి, రాపూరు, సూళ్లూరుపేట, గూడూరు ఆర్టీసీ డిపోల వద్ద ధర్నా చేశారు. వెంకటగిరి డిపో ప్రెసిడెంట్ పీవీ రామారావు, రాపూరు డిపో సెక్రటరీ కేవీ రత్నం, జోనల్ కార్యదర్శి లుక్సన్, తిరుపతి జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు ఎం.శేఖర్, గూడూరు డిపో అధ్యక్షుడు ప్రవీణ్ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ నిలుపుదల చేయాలని కోరారు. అన్ని కేటగిరీల్లో ప్రమోషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నైట్ అవుట్ అలవెన్స్ రూ.400లు ఇవ్వాలని, గ్యారేజ్‌లో స్పేర్‌పార్ట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లపై స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిపో మేనేజర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌డీఏ రజ్, ఎస్‌కే జి బాషు, కృష్ణారెడ్డి, పి భాస్కర్, గ్యారేజీ ప్రెసిడెంట్ కెఎల్‌రావు, శివకుమార్, కృష్ణ, రాపూరు డిపో కార్యదర్శి రమణయ్య, గ్యారేజ్ కార్యదర్శి సుధాకర్, ప్రెసిడెంట్ హరిబాబు, సీసీఎస్ డెలిగేట్ నిస్సార్ అహ్మద్, భాస్కర్‌రావు, సూళ్లూరుపేట డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం రాజేష్, షాజహాన్, శ్రీను, సుబ్బయ్య, సిస్టం సూపర్‌వైజర్ కాలేషా, గ్యారేజీ సెక్రటరీ శశిధర్, మాధవ, సునీల్, రఫీ, జానకిరామ్, గూడూరు డిపో నుంచి జోనల్ అసిస్టెంట్ కార్యదర్శి అహ్మద్, రీజనల్ వైస్ ప్రెసిడెంట్ వెంకయ్య, కార్యదర్శి ప్రవీణ్, క్రిష్ణ, వీరయ్య, శేఖర్, సందాని, సుధాకర్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


రాపూరు ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు


గూడూరు : ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్‌ఎంయూ కార్మిక సంఘ నాయకులు


వెంకటగిరి ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూఏ నేతలు


సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో ఎదుట ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఉద్యోగులు